సాక్షి
తిరుపతి
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



పరిశోధనలకు అవకాశం

అరుదైన మూలకాలపై అద్వితీయ పరిశోధనలకు అవకాశం ఉందని కొచ్చిన వర్సిటీ వీసీ జునాయిడ్ బుషిరీ అన్నారు. - 4లో



హమ్మయ్యా.. హాల్‌టికెటొచ్చింది!

ఎస్వీయూ పరిధిలో నెలకొన్న హాల్‌టికెట్ల గందరగోళానికి తెర పడి. విద్యార్థులకు కొత్త హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. - 4లో



ఘనంగా భాష్యకారుల ఉత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంతో బుధవారం భాష్యకారుల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. - 4లో

న్యూస్‌రీల్

పాఠశాల యథావిధిగా కొనసాగించాలి

– స్కూలు ఎదుట తల్లిదండ్రుల ఆందోళన


పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

వెంకటగిరి రూరల్: మండలంలోని బుసపాళెంలో ప్రాథమిక పాఠశాలను యథావిధిగా ఐదో తరగతి వరకు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ బుసపాళెం ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు కొనసాగుతున్నాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో తాజాగా తీసుకొచ్చిన మార్పులతో 2025–26 విద్యాసంవత్సరం నుంచి ఒకటి, రెండు తరగతుల వరకే పరిమితి చేయడం సరికాదన్నారు. పాఠశాలలో సుమారు 34 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలను రెండో తరగతికే పరిమితి చేయడంతో 3,4,5 తరగతి చదువుతున్న విద్యార్థులు వల్లివేడుకు వెళ్లాలని ఉపాధ్యాయులు సూచించినట్లు తెలిపారు. బుసపాళెం నుంచి వల్లివేడు గ్రామానికి సుమారు నాలుగు కిలో మీటర్లు వెళ్లాల్సిరావడంతో తమ బిడ్డలు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆరోపించారు. అంతేగాకుండా ఆటోలో రవాణా చేయించి చదివించాలంటే తలకు మించిన భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలను యథావిధిగా కొనసాగాలే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


నారాయణవనం నుంచి తొలి ఐఏఎస్


సురేష్

నారాయణవనం: యూపీఎస్సీ పరీక్షల్లో 988 ర్యాంకును సాధించి మండలం నుంచి తొలి ఐఏఎస్‌గా గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన పాముూరి సురేష్ గురింపు తెచ్చుకున్నారు. జెన్‌కో ఏఈగా పనిచేస్తూ ఐఏఎస్ కావాలన్న కలను సురేష్ ఏడో ప్రయత్నంలో సాకారం చేసుకున్నాడు. గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన సాధారణ రైతు మురగయ్య, మునిలక్ష్మి దంపతుల కుమారుడు సురేష్ పాఠశాల విద్యను అరణ్యం కండ్రిగ ఉన్నతపాఠశాలలో పూర్తి చేశాడు. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి మెకానికల్ డిప్లమో పొందారు. కర్నూలు పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసి, 2012లో జెన్‌కోలో ఏఈగా చేరారు. ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో 2017 నుంచి సివిల్స్ రాయడం ప్రారంభించాడు. మూడు ప్రయత్నాలు విఫలం కావడంతో 2020లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నారు. ఏడో ప్రయత్నంలో తన కలకు సాకారం చేస్తూ ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. సురేష్ ఐఏఎస్‌కు ఎంపిక కావడంతో గ్రామంలో బంధువులు, సన్నిహితులు ఆనందం వ్యక్తం చేశారు.

అమ్మాయిలదే హవా

పది పరీక్షల ఫలితాల్లో ఈ సారీ అమ్మాయిలే పదింతలు మెరిశారు. తమ సత్తా చాటారు. ఉత్తమ ఫలితాల సాధించి తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మన్నలు పొందారు. కాగా ఈ ఏడాది జిల్లా తొమ్మిది మెట్టు దిగజారి, 19వ స్థానంలో నిలిచింది. కాగా గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణల ఫలితాలు నేడు ప్రతిబింబించాయి. ఈ ఏడాది సర్కారు స్కూలు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు.



విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఈఓ కేవీఎస్ కుమార్

అన్ని యాజమాన్య పాఠశాలల ఉత్తీర్ణత శాతం వివరాలు

యాజమాన్యం	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	ఉత్తీర్ణతా శాతం
ఏపీ మోడల్	377	307	81.43 శాతం
ఎయిడెడ్	700	575	82.14
ఏపీబీసీ వెల్ఫేర్	434	405	93.32
ఏపీఆర్ఈఐఎస్	160	150	93.75
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్	837	728	86.98
ఏపీటీఈఆర్ఎస్	428	320	74.77
ప్రభుత్వ పాఠశాలలు	729	380	52.13
కేజీబీవీ	187	156	83.42
మున్సిపల్	982	636	64.77
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్	14,458	10782	94.10
జిల్లా పరిషత్	10,387	6,859	66.03

పది ఫలితాల్లో మెరిసిన బాలికలు

- 79.83 శాతం ఉత్తీర్ణతతో జిల్లాకు 19వ స్థానం
- 26,679 మంది విద్యార్థుల్లో 21,298 మంది ఉత్తీర్ణత
- బాలురు 76.83 శాతం, బాలికలు 83.18 శాతం ఉత్తీర్ణత
- మే 19 నుంచి 28వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష


తల్లిదండ్రులతో కలాపతి ఇంద్రజ


మూడె షెవిత


ఆదేరు వందన

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఎప్పటిలానే ఈ ఏడాది 83.18 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించారు. గత ఏడాది ఫలితాల్లో 90.71 శాతం ఉత్తీర్ణతతో జిల్లా పదో స్థానంలో నిలవగా ఈ ఏడాది 79.83 శాతం ఉత్తీర్ణతతో 19వ స్థానానికి దిగజారింది. తిరుపతి జిల్లాలోని 34 మండలాల పరిధిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 164 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ పరీక్షలకు బాలురు 14,063 మంది, బాలికలు 12,616 మంది, మొత్తం 26,679 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలురు 10,804 (76.83 శాతం) మంది, బాలికలు 10,494(83.18 శాతం) మంది, మొత్తం 21,298 (79.83శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లిష్ మీడియంలో 24,861 మంది హాజరుకాగా వారిలో 20,176 (81.16శాతం)మంది, తెలుగు మీడియంలో 1,728 మందిలో 1,043 (63.36శాతం) మంది, తమిళం మీడియంలో 72 మందిలో 61 (84.72 శాతం) మంది, ఉర్దూ మీడియంలో 18 మందికి 18 (100 శాతం)మంది ఉత్తీర్ణత సాధించారు.

మే 19నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు, రీ–కౌంటింగ్, రీ–వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 24 నుంచి 30వ తేదీ లోపు ఆలస్య రుసుము లేకుండా, అలాగే మే 1నుంచి 18వ తేదీలోపు ఆలస్యరుసుముతో కలిపి దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ తెలిపారు. రీ–కౌంటింగ్‌కు రూ.500, రీ–వెరిఫికేషన్‌కు రూ.వె య్యి ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్ష దరఖాస్తు, ఫీజులు చెల్లించే సమయంలోనే మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిజిటల్ సంతకం చేసిన మైగ్రేషన్ సర్టిఫికెట్‌ను ఫలితాలు ప్రకటించిన నాలుగు రోజుల తరువాత విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని డీఈఓ తెలిపారు.

పది ఆణిముత్యాలకు ట్యాబ్‌లు

తిరుపతి అర్బన్: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ కేవీఎస్ కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని చే పట్టారు. డక్కిలి మండలంలోని చాపలపల్లి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి కే. ఇంద్రజ 600కు 594 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ఎర్రావారిపాళెం మండలంలోని కోటకాడపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.సేవిత 591 మార్కులతో ద్వితీయ స్థానం, నాయుడుపేట మండలం మేనకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఏ.వందన 589 మార్కులు, అగ్రహారం పల్లి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఏ.కేతన్ 589 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రభంజనం..

గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలు నేడు ఫలితాల రూపంలో ప్రతిబింబించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధిక శాతం మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి కార్పొరేట్‌కు ఏమాత్రం తీసిపోమని మరోసారి రుజువు చేశారు.


అనంతపురం కేతన్‌ను అభినందిస్తున్న డీఈఓ కేవీఎస్.కుమార్ తదితరులు

ఉత్తమ మార్కులతో విజయఢంకా..

ఈ ఏడాది పది ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యధిక మంది ఉత్తమ మార్కులు సాధించి, విజయఢంకా మోగించారు. అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 26,679 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 21,298 మంది ఉత్తీర్ణత సాధించగా 5,381 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. పాసైన వారిలో ఫస్ట్‌క్లాస్‌లో 17,630 మంది, సెకండ్ క్లాస్‌లో 2,546 మంది, థర్డ్ క్లాస్‌లో 1,122 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈఓ కేవీఎస్.కుమార్ తెలిపారు.

అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ విద్యార్థులు వీరే..

1. కలాపతి ఇంద్రజ, 594 మార్కులు, ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, వెంకటగిరి
2. మూడే షెవిత, 591మార్కులు, జెడ్పీ హైస్కూల్, కోటకాడపల్లె, ఎర్రావారిపాళెం మండలం
3. అనంతపురం కేతన్, 589 మార్కులు, ఎంపీఎల్ హైస్కూల్, బాబు అగ్రహారం, శ్రీకాళహస్తి మండలం
4. ఆదేరు వందన, 589 మార్కులు, జెడ్పీ హైస్కూల్, మేనకూర్, నాయుడుపేట మండలం

సివిల్స్‌లో 'సాయితేజ'ం


తల్లిదండ్రులతో నెల్లూరు సాయి తేజ

చిల్లకూరు: లక్ష్యసాధనకు పట్టుదలతో కృషి చేసి ఐపీఎస్‌ను వదలి ఐఏఎస్ ఎంపిక అయ్యాడు నాయుడుపేటకు చెందిన సాయితేజ. నాయుడుపేట మండలం చిలమత్తూరు గ్రామానికి చెందిన నెల్లూరు శ్రీనివాసులు చిల్లకూరు మండలం గమ్మళ్లదిబ్బలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్య సరస్వతి ఓజిలి ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తుంది. వారి కుమారుడు నెల్లూరు సాయితేజ చిల్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది వరకు చదివి, మంచి మార్కులతో పాస్ అయ్యాడు. అటు తరువాత ఇంటర్ విజయవాడలో చదివి ఐఐటీలో ఇంజినీరింగ్ చేసి హైదరాబాద్‌లో బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగంలో చేరాడు. అయితే తను అనుకున్న లక్ష్యం ఇది కాదు అని సొంతంగా సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. దీంతో 2023–24 లో జరిగిన సివిల్స్‌లో 558వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికై హైదరాబాద్‌లోనే పోలీస్ అకాడమిలో శిక్షణ తీసుకుంటున్నాడు. అయినా అనుకున్న లక్ష్యం సాధించేందుకు ఐపీఎస్‌గా శిక్షణ పొందుతూనే 2024–2025లో మరోసారి సివిల్స్ పరీక్షలకు పట్టుదలతో సాధన చేశాడు. ఈ సారి సివిల్స్‌లో 154వ ర్యాంకు సాధించాడు. దీంతో ఐఏఎస్‌కు మార్గం సుగమమం కావడంతో చిన్నతనంలో అనుకున్న లక్ష్యం సాధించాడు. తల్లిదండ్రులు ఇచ్చి ప్రోత్సాహంతోపాటుగా తన భార్య ఇచ్చిన సహకారంతోనే అనుకున్న లక్ష్యం సాధివంచగలిగానని సాయి తేజ అంటున్నారు.

జర్నలిస్టులపై దాడులు హేయం


ఏలూరులో సాక్షి కార్యాలయంపై టీడీపీ ఎమ్మెల్యే దాడికి నిరసనగా తిరుపతి బస్టాండ్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పాత్రికేయులు

- మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టుల నిరసన
- ఈస్ట్‌పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే చింతమనేనిపై ఫిర్యాదు
- జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ర్యాలీలతో కదం తొక్కిన కలం కార్మికులు


ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్‌లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అని తిరుపతి జర్నలిస్టులు మండిపడ్డారు. పత్రికల్లో వచ్చిన కథనాల్లో ఒకవేళ అవాస్తవాలు ఉంటే..వాస్తవాలను తెలియజేస్తూ ఖండన ఇవ్వాలే తప్ప భౌతికదాడులకు పాల్పడడం దారుణమైన చర్య అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై దాడులకు పాల్పడిన దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం తిరుపతి బస్టాండ్‌కు సమీపంలోని జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. మీడియాపై కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడికి నిరసన తిరుపతితోపాటు జిల్లా వ్యాప్తంగా కదం తొక్కారు. కలం కార్మికుల నిరసనలు, ధర్నాలు, ర్యాలీలతో హోరెత్తించారు. వాస్తవాలను ప్రజలకు చేరవేస్తే జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్రలో ఎప్పుడు ఇలా అక్రమ కేసులు పెట్టడం..బెదిరింపులకు పాల్పడడం జరగలేదని.. అయితే కూటమి సర్కార్‌లో నిత్యకృత్యమైందని మండిపడ్డారు. సాక్షి దినపత్రికలో ప్రచురించిన వాస్తవాలను జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం ఇటీవల ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు మరో ఆరుగురు పాత్రికేయులపై తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం నేరమా, కలం కార్మికులపై కక్ష సాధింపులపై న్యాయం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఏకమై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో జర్నలిస్టులు దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. లేదంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బుదేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టులపై ఉగ్రదాడి అమానుషం

- ఉగ్రవాదులను సమూలంగా ఏరివేయాలి
- దాడిని ఖండిస్తున్నాం
- వైఎస్సార్‌సీపీ కొవ్వొత్తుల ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



ర్యాలీ చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

తిరుపతి మంగళం : జమ్ము కశ్మీర్‌లోని పెహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం రాత్రి తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం నుంచి తిరుచానూరు బైపాస్‌రోడ్డు వరకు భూమన కరుణాకరరెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై పాకిస్థాన్ ఉగ్రవాదులు చేసిన కిరాతక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశ సమైక్యతను దెబ్బతీసేలా జరిగిన ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదన్నారు. హనీమూన్ కోసం వెళ్లిన నూతన దంపతుల్లో అబ్బాయిని కాల్చిచంపడం దుర్మార్గపు చర్య అన్నారు. రాజకీయాలకతీతంగా ఉగ్రదాడులను ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను సమూలంగా ఏరిపారేయాలన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సుమారు 30 మంది టూరిస్టులకు తగిన న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన వేడుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ కశ్మీర్‌లో ఇప్పుడిప్పుడే ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఈ తరుణంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు తెగబడడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ జోనల్ ఇన్‌చార్జ్ షయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ మాట్లాడుతూ ముష్కరులకు కుల మతాలు, దయాదాక్షిణ్యాలు ఉండవన్నారు. శాంతికి చిహ్నమైన భారతదేశంలోకి ఉగ్రవాదులు చొరబడి మారణకాండ సృష్టించడం బాధాకరమన్నారు. పాకిస్థాన్ కుక్కలను భారదేశంలోకి చొరబడకుండా ఉగ్రవాదాన్ని సమూలంగా ఏరిపారేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో మహిళలు

పిరికి పందల చర్య

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: కశ్మీర్ సమీపంలోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో మంగళవారం పర్యాటకులపై ఉగ్ర వాదుల దాడి పిరికిపందల చర్య అని వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజక వర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు మతం అడిగి మరీ మారణకాండకు దిగడం, భార్య కళ్ల ముందే భర్తను కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, నేతలు హరికృష్ణారెడ్డి, జయకర్, వెంకటరమణ, కోటి, మన్నూరు శివ, రవి, రాజ, భారతి, అరుణ్, ప్రకాష్, హేమాద్రి, విజయలక్ష్మి, శశి, కుప్పిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి, గురు స్వామిరెడ్డి పాల్గొన్నారు.


తిరుపతి రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, పార్టీ నేతలు

క్లుప్తంగా

కొనసాగుతున్న రూమ్ ఇంటర్వెన్షన్ కోర్స్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా ఎంఆర్‌పల్లి పోలీస్ గ్రౌండ్‌లో ఈనెల 21వ తేదీన ప్రారంభమైన రూమ్ ఇంటర్వెన్షన్ కోర్స్ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ తరగతులు డీఎస్పీ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మే నెల 1 తేదీ వరకు 11 రోజులు పాటు జరగనున్నాయి. ఇందులో జిల్లాలోని ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఆఫీసర్ స్థాయి అధికారులతో పాటు ప్రతి ఒక్కరికీ ఈ రూమ్ ఇంటర్వెన్షన్ కోర్సు శిక్షణ ఇస్తారు. ఏదైనా ఉగ్రవాదుల దాడి జరిగినప్పుడు స్పెషల్ పార్టీలు వచ్చేంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.. అక్కడ ఎలాంటి వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్న అంశాలపై వివరించారు. మాక్ డ్రిల్ తరగతులు కూడా నిర్వహించారు.

టెక్నాలజీతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

తిరుపతి సిటీ: టెక్నాలజీని సంస్కృత శాస్త్రాలలో విరివిగా వినియోగించుకుని విద్యార్థులు జ్ఞానాన్ని పొందాలని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సూచించారు. వర్సిటీలో జాతీయ సంస్కృత వర్సిటీ, సీడాక్ సంస్థ సంయుక్తంగా ఏఐ, ఎంఎల్, క్వాంటం కంప్యూటింగ్, ఐకేఎస్‌పై రెండు రోజులు నిర్వహించిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ సంస్కృతాన్ని ఆధునిక సమాజానికి అందించాలంటే టెక్నాలజీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణప్రపూర్ణ, విభాగాధిపతి ప్రొఫెసర్ గణపతి భట్, ప్రొఫెసర్ రమాశ్రీ, డాక్టర్ జానకి, ప్రొఫెసర్ చంద్రశేఖరం, శ్రీధర్, నాగలక్ష్మీ, ప్రసన్న, సంకీర్తి పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

తిరుపతి క్రైమ్: వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్‌ని అరెస్టు చేసినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ పేర్కొన్నారు. సీఐ కథనం మేరకు.. తిరుపతి త్యాగరాజునగర్‌లో ఇటీవల ఓ మహిళ మెడలో గొలుసు చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం అలిపిరి రోడ్డులోని వివేకానంద సర్కిల్ బస్ స్టాప్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని విచారించగా తిరుపతి రూరల్, శెట్టిపల్లి పంచాయతీ బీటీఆర్ కాలనీలో నివాసముంటున్న పందిపట్ల దేవరాజులుగా గుర్తించారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవరాజులు పెయింట్ పని చేస్తూ జీవనం కోసం ఇక్కడికి వచ్చాడు. అతడు చైన్ చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని, అతని వద్ద నుంచి 17 గ్రాముల బంగారు చైను, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

హమ్మయ్యా.. హాల్‌టికెటొచ్చింది!

డిగ్రీ పరీక్షలకు తొలగిన అడ్డంకులు

- ఎస్వీయూ హాల్‌టికెట్ల జారీలో గందరగోళానికి తెర
- అందుబాటులోకి నూతన హాల్‌టికెట్లు
- జ్ఞానభూమి పోర్టల్ నిర్లక్ష్యమే కారణం



తిరుపతి సిటీ: ఎస్వీయూ హాల్ టికెట్ల జారీలో గందరగోళానికి తెరపడి, ఎట్టకేలకు విద్యార్థులకు హాల్ టికెట్ల అందుబాటులోకి తెచ్చారు. ఎస్వీయూ పరిధిలో హాల్‌టికెట్ల జారీలో గందరగోళంగా మారడం, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లలు తప్పుల తడకగా ఉండటంతో విద్యార్థులలో అయోమయం నెలకొంది. దీంతో ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసి వచ్చేనెల 12, 14వ తేదీల్లో నిర్వహించనున్నారు. మిగిలిన పరీక్షలు యథావిధిగా గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా తప్పుల తడకగా జారీ చేసిన హాల్‌టికెట్లను రద్దు చేసి, సరి చేసిన నూతన హాల్‌టికెట్లను మంగళవారం రాత్రి నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.

జ్ఞానభూమి పోర్టల్‌తోనే గందరగోళం

ఏపీసీఎఫ్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న జ్ఞానభూమి పోర్టల్ సాంకేతిక లోపంతోనే డిగ్రీ హాల్‌టికెట్ల జారీలో తప్పులు దొర్లినట్లు వర్సిటీ అధికారులు గుర్తించారు. హాల్‌టికెట్ల జారీలో జరిగిన గందరగోళంపై వర్సిటీ అధికారులు విచారణ చేపట్టి ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపం జరిగినట్లు గుర్తించారు. జరిగిన తప్పులు వెంటనే సరిచేసి నూతన హాల్‌టికెట్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. దీంతో గందరగోళానికి తెరపడింది. బుధవారం హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియలో విద్యార్థులు తలమునకలై ఉన్నారు. గురువారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలకు ఒకరోజు ముందు ఇలాంటి అయోమయపరిస్థితులు నెలకొనడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఒకింత అసహనానికి గురయ్యారు.

డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల సమాచారం

ఎస్వీయూ పరిధిలో ప్రైవేటు, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు	124
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	15
టీటీడీ డిగ్రీ కళాశాలలు	4
పరీక్షా కేంద్రాలు	64
2వ సెమిస్టర్ రాస్తున్న విద్యార్థులు	11,540 మంది
4వ సెమిస్టర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు	12,067

వివాదాస్పదంగా మారుతున్న పరీక్షల విభాగం

ఎస్వీయూ పరీక్షల విభాగం ప్రతిసారీ వివాదాస్పదంగా మారుతోంది. పరీక్షల ఫలితాల విడుదలలో జాప్యం, పరీక్షల నిర్వహణ, రీవాల్యుయేషన్, ధ్రువపత్రాల జారీ తదితర విషయాల్లో ప్రతిసారీ ఏదో రకంగా వివాదాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో డిగ్రీ పరీక్షల హాల్‌టికెట్ల జారీ విషయంలోనూ మరోసారి ఎగ్జామినేషన్ సెక్షన్‌పై విద్యార్థులు మండిపడుతున్నారు. జ్ఞాన భూమి పోర్టల్‌లో సాంకేతికలోపం అనడం కంటే ఉద్యోగులు పోర్టల్‌లో హాల్‌టికెట్లు అప్‌లోడ్ చేయడంలో జరిగిన నిర్లక్ష్యమేనని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ఇటీవల అధికారులు అర్హత, అనుభవం ప్రామాణికంగా తీసుకోకుండా ఉద్యోగులను పలు సెక్షన్ల నుంచి పెద్ద ఎత్తున బదిలీలు చేయడమేనని వారు విమర్శిస్తున్నారు.

సాంకేతిక లోపమే కారణం



డిగ్రీ హాల్‌టికెట్ల జారీలో తప్పులు దొర్లిన మాట వాస్తవం. ఏపీ సీఎఫ్ఎస్ఎస్ పోర్టల్‌లో సాంకేతిక లోపంతో హాల్‌టికెట్లలో గందరగోళం ఏర్పడింది. వెంటనే తప్పులను సరిదిద్ది నూతన హాల్‌టికెట్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచాం. తొలి రెండు పరీక్షలను వాయిదా వేశాం. మిగిలిన పరీక్షలు షెడ్యూల్ ప్రకారం గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్ష కేంద్రాల్లో వేసవి నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించనున్నాను. ఇప్పటికే వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశాం.

– ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

ఈకేవైసీకి 30 వరకు గడువు

తిరుపతి అర్బన్: రేషన్‌కార్డుల ఈకేవైసీకి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని, జిల్లాలో 1.14 లక్షల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శేషాచలం రాజు బుధవారం తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని వారికి వచ్చే మే నెలలో బియ్యం ఇవ్వలేమని స్పష్టం చేశారు. బియ్యం ఇవ్వకపోవడమే కాదు రేషన్‌కార్డులో వారి పేరు తొలగిస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో పలువురు కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఐదేళ్ల లోపు పిల్లలు మాత్రం ఈకేవైసీ చేయించుకోవాల్సిన పనిలేదని వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

చంద్రగిరి: మండలంలోని రాయలపురం వద్ద ముళ్లపొదల్లో ఓ చెట్టుకొమ్మకు గుర్తితెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సుమారు 38 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి గ్రామానికి సమీపంలోని ఓ ముళ్ల చెట్టు కొమ్మకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. గ్రామానికి చెందిన వ్యక్తులు బహిర్భూమికి ముళ్లపొదల్లోకి వెళ్లగా కంపచెట్టు కొమ్మకు ఉరివేసుకుని వ్యక్తి మృతి చెంది ఉండడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులను విచారించినా గుర్తుతెలియని వ్యక్తి గురించిన సమాచారం లభించలేదు. సంఘటనాస్థలంలో మృతునికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసిన పోలీసులు పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రాధాన్యత



వినతి పత్రం ఇస్తున్న నేతలు



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి

తిరుపతి అర్బన్: పరిశ్రమల ప్రోత్సాహానికి తొలి ప్రాధాన్యత ఉంటుందని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాకు చెందిన పండ్ల పరిశ్రమల అసోసియేషన్ నేతలు కట్టమంచి బాబి, శివకుమార్, బాబు, తరుణ్ తమసమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మామిడికి గిట్టుబాటు ధరలు లేకపోవడంపై ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యవేడు మండలంలోని దాస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిశ్రమలశాఖ జిల్లా అధికారి సుధాకర్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఉద్యానశాఖ అధికారులు మధుసూదన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

80 పరిశ్రమలకు ఏపీఐఐసీ భూములు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం, తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాలలోని ఏపీఐఐసీకి సంబంధించిన భూములను 80 పరిశ్రమలు ఏర్పాటుకు కేటాయించినట్లు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాలతోపాటు తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల గ్రామంలోని ఏపీఐఐసీ భూములు, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏపీఐఐసీకి ఉన్న లింకు రోడ్లను పరిశీలించారు.

శ్రీసిటీని సందర్శించిన మంత్రి కొండపల్లి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ కేటగిరికి చెందిన నూతన పరిశ్రమ గుప్తా ఆక్సిజన్ ప్రైవేట్ లిమిటెడ్ శంకుస్థాపనలో మంత్రి పాల్గొన్నారు. తరువాత శ్రీసిటీ పరిసరాల్లో మంత్రి పర్యటించారు. ఎవర్గన్ టీ పరిశ్రమను సందర్శించారు. ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే కె.ఆదిమూలం, ప్రిన్సిపల్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎం.శ్రీనివాస శంకర ప్రసాద్, గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ రాంనాథ్ వెలమాటి పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడి రాజీనామా



రాజీనామా లేఖ చూపుతున్న సర్వోత్తమరెడ్డి

కోట: తెలుగుదేశం పార్టీ కోట మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఆయన నివాసంలో తెలిపారు. రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షునికి, అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు పంపినట్లు తెలిపారు. పార్టీ మండలాధ్యక్ష పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు.

పార్టీలో విభేదాలే కారణమా?

టీడీపీ మండలాధ్యక్షుడిగా 2017 నుంచి కొనసాగుతున్న సర్వోత్తమరెడ్డి పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం వెనుక పార్టీలో విభేదాలే కారణంగా తెలుస్తోంది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు ముఖ్య అనుచరుడిగా సర్వోత్తమరెడ్డి గుర్తింపు పొందారు. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే అండతో కోట మండలంలో తనదైన ముద్ర వేశారు. అధికారుల బదిలీలు, రాజకీయ కార్యకలాపాల్లో ఆయన మాటే చెలామణి అయ్యేది. కానీ పార్టీలో తలెత్తిన అంతర్గత విభేదాల కారణంగా ఆయన గత కొంతకాలంగా కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. టీడీపీలోని ఓ వర్గం ఆయన్ని వ్యతిరేకిస్తుండగా కొందరు నేతలు అవమానకర రీతిలో మాట్లాడినట్లు ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు బిజినెస్ ప్లాన్ పోటీలు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో విద్యార్థినులకు మహిళా వర్సిటీ, తిరుపతి ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంట్రా–ఇన్‌స్టిట్యూషనల్ బిజినెస్ ప్లాన్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఐఐఈ కోకన్వీనర్ లలిత, సభ్యులు రాజ్యలక్ష్మీ, రమాజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల్లోని వినూత్న వ్యాపార ఆలోచనలను ప్రదర్శించేందుకు పోటీలు దోహదపడతాయని వివరించారు. విద్యార్థులు 12 బృందాలుగా ఏర్పడి తమ బిజినెస్ ఐడియాలతో పోటీలో పాల్గొనడం హర్షనీయమన్నారు.

28 నుంచి అటానమస్ కళాశాలలో డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ: అటానమస్ హోదా పొందిన టీటీడీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు 2వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అటానమస్ పొందిన ఎస్వీ ఆర్ట్స్, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల అధికారులు కసరత్తు చేస్తున్నారు. పరీక్షలకు 3 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు.

అద్వితీయ పరిశోధనలకు అవకాశం



ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన విద్యార్థులకు బహుమతిని ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: అరుదైన మూలకాలపై అద్వితీయ పరిశోధనలకు మన దేశంలో అవకాశం పెరిగిందని కొచ్చిన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం జునాయిడ్ బుషిరీ పేర్కొన్నారు. ఎస్వీయూ ఫిజిక్స్, పద్మావతి వర్సిటీ బయోటెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్‌ఎర్త్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అరుదైన మూలకాలు దొరికే ప్రాంతాలను గుర్తించి, ప్రాసెసింగ్ చేసే పద్ధతులను మెరుగుపరుచుకోవాలన్నారు. సదస్సును అర్థవంతంగా చేపట్టిన నిర్వాహకులు ఫిజిక్స్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు, ప్రొఫెసర్ జాన్ సుష్మాను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం సింహపురి వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ పరిశోధనలు కొత్త ధోరణిలో సాగేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నించాలని సూచించారు. అనంతరం ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ దీపేంద్ర సింగ్, కార్యదర్శి డాక్టర్ ఎమ్మెల్వీ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సికే జయశంకర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

చంద్రగిరి: కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. ఎం.కొంగరవారిపల్లెకు చెందిన నరసింహులు(72) బుధవారం వ్యక్తిగత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. పనులు ముగించుకుని బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సులో ఎం.కొంగరవారిపల్లి చేరుకున్నాడు. బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న తమిళనాడుకు చెందిన కారు వృద్ధుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. అనంతరం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 61,828 మంది స్వామిని దర్శించుకున్నారు. 21,165 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.61 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

ఘనంగా భాష్యకారుల ఉత్సవం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. మే 2న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంతపరంగా మీమాంస గ్రంథానికి 'శ్రీభాష్యం' పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. శ్రీరామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటి రోజున బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం శ్రీ రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మూడు వాహనాల ఢీ.. ఇద్దరికి గాయాలు

తిరుపతి రూరల్: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలోని తిరుపతి రూరల్ మండలం వకుళామాత ఆలయం వద్ద బుధవారం మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నుంచి చంద్రగిరి వైపు ఓ ట్రాక్టర్ వెళుతోంది. ఆ ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఆ వెనుకనే వస్తున్న కారు లారీని ఢీకొంది. ఈ ఘటనలో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. మోల్డింగ్ వేసేందుకు ఉపయోగించే మిల్లర్‌ను తీసుకువెళుతున్న ట్రాక్టర్ అడ్డదిడ్డంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి రూరల్ పోలీసులు తెలిపారు.

పరిశోధనలతోనే సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న వెటర్నరీ వీసీ జేవీ రమణ

తిరుపతి సిటీ: వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిశోధనలతోనే పరిష్కార మార్గం దొరకుతుందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ అభిప్రాయపడ్డారు. ఎన్జీరంగా వర్సిటీ ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం పీజీ విద్యార్థులకు బ్రిడ్జింగ్ సైన్స్ సస్టయినబులిటీ అండ్ ఫుడ్ సెక్యూరిటీ అనే అంశంపై చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలకు దీటైన పరిశోధనలు జరగాలన్నారు. విద్యార్థులు జాతీయ సదుస్సుల్లో పాల్గొనడం ద్వారా వివిధ రాష్ట్రాల విద్యార్థుల మధ్య పరిశోధన అంశాలపై చర్చ, సమాచార మార్పిడి జరుగుతుందన్నారు. అలాగే విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. వర్సిటీ పీజీ డీన్ ఏవీ రమణ మాట్లాడుతూ జాతీయ సదస్సులో 617 మంది పీజీ విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించారని తెలిపారు. అనంతరం వివిధ పరిశోధన అంశాలలో ప్రతిభ కనబరిచిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ వి.సుమతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పోలీసుల బదిలీలు



బదిలీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖలో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్ రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 393 మంది బదిలీ అయ్యారు. ఇందులో చిత్తూరు నుంచి తిరుపతికి వచ్చిన ఏఎస్‌ఐలు ముగ్గురు, నెల్లూరు నుంచి వచ్చిన ఏఎస్‌ఐలు ఐదుగురు, తిరుపతి నుంచి 19 మంది ఏఎస్‌ఐలు ఉన్నారు. అలాగే 100 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 256 మంది పోలీస్ కానిస్టేబుళ్లు బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఐదేళ్లపాటు ఒకే స్టేషన్‌లో పని చేసిన వారికి మూడు ఆప్షన్లు ఎంచుకునే అవకాశం కల్పించారు. వారి ఎంచుకున్న ఆప్షన్లలో ఒకటిని ఎస్పీ కేటాయించారు. ఆరోగ్యం సరిగా లేని వారికి కోరిన పోలీస్ స్టేషన్‌ను కేటాయించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, రవిమనోహరాచారి, నాగభూషణం, రామకృష్ణ, డీఎస్పీలు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

- మెటర్నిటీ హాస్పిటల్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

తిరుపతి తుడా: మెటర్నిటీ హాస్పిటల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మహేంద్ర డిమాండ్ చేశారు. తిరుపతి ప్రసూతి ఆస్పత్రి ఎదుట కార్మికులతో కలసి పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాల విషయమై పలుసార్లు కాంట్రాక్టర్‌ను, సూపరింటెండెంట్‌ను కలసి విన్నవించినా స్పందించకపోవడం దారుణమన్నారు. రుయాస్పత్రిలో, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించి మెటర్నటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వేతనాలు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పలుసార్లు జిల్లా కలెక్టర్‌కు, సూపరింటెండెంట్‌కు విన్నవించిన స్పందించలేదని వాపోయారు. ఏ వన్ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టామని గతంలో ప్రకటించినా నేటికీ వారే కొనసాగడం దారుణమన్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు సైతం కాంట్రాక్టర్లు అమలుపరచడం లేదని అలాంటి దుర్మార్గం ఇక్కడ నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల నాయకులు గురమ్మ, వనజ, ముని, రాజమ్మ, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.